
చంద్రబాబు అరకులోయ రాక రేపు



విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకులోయలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఆయన శనివారం ఉదయం 9.45 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో 10.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి 11.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.35 గంటలకు అరకులోయ చేరుకుంటారు. బహిరంగసభ ముగిసిన తరువాత మధ్యాహ్నం 1.40 గంటలకు అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కోనసీమ జిల్లా మండపేట వెళతారు.

షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో బెల్టు షాపు

సిబ్బంది శిథిల నివాస గృహాల్లో ఓపెన్ బార్ నిర్వహణ

- బెల్టు షాపు నిర్వాహకుడికి అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయని ఆరోపణలు
- ఎక్సైజ్ సిబ్బంది సహకారంపై అనుమానాలు



తుమ్మపాల వీవీ రమణ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో తోపుడు బండిపై ఏర్పాటు చేసిన దుకాణం

అనకాపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): **బెల్టు షాపులు లేకుండా చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వం ఒక వైపు ప్రచారం చేస్తుంటే, మరో వైపు అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలతో కలిసి ఎక్సైజ్ సిబ్బంది బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.**

జిల్లాలో ప్రతి గ్రామంలో బెల్టు షాపులు దర్శన మిస్తున్నాయి. బెల్టు షాపుల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు డిమాండ్‌ను బట్టి రూ.10 నుంచి రూ.20 అదనంగా వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్లు సరకు అందిస్తూ ప్రతి నెలా జీతం కాకుండా ... మిగతా 8వ పేజీలో



సిబ్బంది శిథిల నివాస గృహాల వద్ద మందుబాబుల హడావిడి

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

దివంగత ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు వర్ధంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కశింకోట మండలం తీడ గ్రామంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, అనకాపల్లి మెయిన్‌రోడ్డులోని ఎన్టీఆర్ జంక్షన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



కశింకోట మండలం తీడ గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు

టికెట్ టెన్షన్

వైసీపీ నేతల్లో ఉత్కంఠ

- నాలుగో జాబితాలో విశాఖ, అనకాపల్లి జిల్లాల ప్రస్తావన నిల్
- సిట్టింగ్‌ల్లో పలువురికి అవకాశం ఉండదని ప్రచారం
- తెరపైకి రోజుకొకరి పేరు
- అనకాపల్లి ఎంపీ అభ్యర్థి కోసం అధిష్ఠానం అన్వేషణ
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పోటీపై ఇంకా రాని స్పష్టత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల్లో రోజురోజుకూ ఉత్కంఠ పెరిగిపోతోంది. అధిష్ఠానం గురువారం రాత్రి పదిన్నర గంటలకు నాలుగో జాబితా విడుదల చేసింది. అయితే అందులో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు సంబంధించిన నియోజకవర్గాల ప్రస్తావన లేదు. ఇప్పటివరకూ రెండు జిల్లాల్లో ఒక ఎంపీ స్థానంతో పాటు మూడు అసెంబ్లీ నియోజక వర్గాలపై మాత్రమే స్పష్టత ఇచ్చింది. మిగిలిన వాటి పరిస్థితి ఏమిటనే దానిపై సిట్టింగ్‌లతో పాటు ఆశావహుల్లో అయోమయం నెలకొంది.

ఎన్నికలకు మరో మూడు నెలలు మాత్రమే సమయం ఉంది. టీడీపీ, జనసేనలు సీట్ల సర్దుబాటులో ఉండగా, వైసీపీ దఫదఫాలుగా అభ్యర్థులను (నియోజక వర్గాల సమన్వయకర్తల పేరిట) ప్రకటిస్తోంది. ఈసారి చాలామంది సిట్టింగ్‌ల మార్పు తప్పదని పార్టీ అధ్యక్షుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏడాది కిందటే సంకేతాలు ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే మార్పులు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకూ ఏడు పార్లమెంటు, 61 అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయ కర్తలను ప్రకటించారు. మొదటి జాబితాలో విశాఖ జిల్లా గాజువాక సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్థానంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును ఇన్‌చార్జిగా ... మిగతా 8వ పేజీలో



గుడివాడ అమర్‌నాథ్



డాక్టర్ సత్యవతి



కరణం ధర్మశ్రీ



అదీప్‌రాజ్

రెవెన్యూ బదిలీలకు రంగం సిద్ధం

ఎన్నికల నేపథ్యంలో పలువురికి స్థానచలనం కలిగే అవకాశం

- నివేదిక సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం
- 22వ తేదీ తరువాత ఉత్తర్వులు



(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెవెన్యూ ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. రెవెన్యూ శాఖలో బదిలీలకు అర్హులైన వారితో జాబితాను జిల్లా యంత్రాంగం సిద్ధం చేస్తోంది.

ఈ నెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటన తరువాత మండల తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లకు స్థాన చలనం కల్పించనున్నారు. ఇప్పటికే ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రాతిపదికన బదిలీ ఉద్యోగుల జాబితా రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గత నాలుగేళ్లలో మూడేళ్లకు పైగా ఉమ్మడి జిల్లాల్లో ఎక్కడ పనిచేసినా, లేదా సొంత జిల్లాకు చెందిన డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల వివరాలు రాష్ట్ర భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ కార్యాలయానికి జిల్లా ఎన్నికల విభాగం నుంచి వెళ్లింది. ఓటర్ల తుది జాబితా ఈ నెల 22న ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో 22వ తేదీ తరువాత ఉద్యోగులకు బదిలీల ఉత్తర్వులు జారీ కానున్నాయి. అనకాపల్లి జిల్లాలో 23 మండలాలు ఉండగా ప్రస్తుతం 31 మంది తహసీల్దార్లు పనిచేస్తున్నారు. 23 మండలాలతో పాటు కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయం, సుజల స్రవంతి, ఎస్ఏపీబీ విభాగాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 8 మంది తహసీల్దార్లు మినహా మిగిలిన వారందరూ ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాకు బదిలీల పరిధిలోకి రానున్నారు. నలుగురు డిప్యూటీ కలెక్టర్లలో ఒకరికి బదిలీ చేయనున్నారు. అదే విధంగా 14 మంది వరకు డిప్యూటీ తహసీల్దార్లకు స్థానచలనం తప్పదంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది జూన్ 30 నాటికి పదవీ విరమణ పొందే నలుగురు రెవెన్యూ ఉద్యోగుల పేర్లు బదిలీల నుంచి మినహాయించారు. దీంతో పాటు 23 మండలాల అభివృద్ధి అధికారులు, స్పెషల్ ఆఫీసర్ల వివరాలను, ఎన్నికల విధుల్లో భాగస్వాములు కానున్న ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల వివరాలను జిల్లా పరిషత్ అధికారుల ద్వారా సేకరించి బదిలీలు జరిపేందుకు సన్నద్ధమవుతున్నారు.

జోన్-1లో ఏడుగురు తహసీల్దార్ల బదిలీ

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర (జోన్-1) జిల్లాల్లో ఏడుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా ఉన్న ఎం.పాల్ కిరణ్‌ను శ్రీకాకుళం జిల్లా పొందూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ పాలనాధికారి ఎంవీ అప్పారావును ఇచ్ఛాపురం తహసీల్దార్‌గా నియమించారు. అలాగే విశాఖపట్నం నగర పాలక సంస్థ ఎస్టేట్ అధికారి కె.ఆనందరావును పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం, వీఎంఆర్డీఏ ప్రత్యేక తహసీల్దారు అడబాల శ్రీనివాసరావును పాచిపెంట, శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఆర్డీవో కార్యాలయ ఏవో బి.రాజమోహనరావును అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు, విజయనగరం జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా ఉన్న కె.శ్రీకాంత్‌ను అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట, శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా ఉన్న జీపీ సూర్యనారాయణను పాయకరావుపేట తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

ఇకపై ఆన్‌లైన్‌లో జిల్లా ఉపాధి కార్యాలయ సేవలు

అనకాపల్లి రూరల్, జనవరి 18: ఉపాధి కార్యాలయ సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి శాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అప్‌డేషన్ సేవల కోసం జిల్లా ఉపాధి కార్యాలయానికి రావలసి వచ్చేదన్నారు. ఇకపై నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఉపాధి కార్యాలయ సేవలు పొందవచ్చునని ఆమె తెలిపారు. employment.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సేవలు పొందవచ్చునని, ఎంప్లాయ్‌మెంట్ కార్డు ప్రింట్ తీసుకోవచ్చునని ఆమె పేర్కొన్నారు.

అమ్మో.. పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్

తరచూ ప్రమాదాలు

- భీతిల్లుతున్న వాహనచోదకులు
- రాంగ్ రూట్‌లపై దృష్టి సారించని పోలీసులు
- జంక్షన్‌లో కానరాని విద్యుత్ లైట్లు

- వార్త 7వ పేజీలో..

పార్శిల్ ఆదాయం భేష్

పీటీడీకి కాసుల వర్షం కురిపిస్తున్న పార్శిల్ రవాణా సేవలు

- జిల్లాలో గత ఏడాది సుమారు రూ.కోటి ఆదాయం
- సత్ఫలితమిస్తున్న డోర్ డెలివరీ సేవలు



నర్సీపట్నంలోని పీటీడీ పార్శిల్ రవాణా కార్యాలయం

నర్సీపట్నం, జనవరి 18: **ప్రజా రవాణా శాఖ (పీటీడీ)కి పార్శిల్ రవాణా సేవలు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. గత ఏడాది జిల్లాలో సుమారు రూ.కోటి వరకు ఆదాయం వచ్చింది. అయితే ఇంత ఆదాయం వస్తున్నా గొడౌన్ సదుపాయం లేకపోవడంతో పార్శిళ్లను ఆరుబయటే ఉంచాల్సి వస్తోంది. ఆదాయం, ఆదరణ దృష్ట్యా గొడౌన్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది.**

నర్సీపట్నం పీటీడీ డిపోలో పార్శిల్ రవాణా సేవల ద్వారా 2022 డిసెంబరు 31 నాటికి రూ.42.5 లక్షలు వస్తే, 2023 డిసెంబరుకి రూ.59 లక్షల రాబడి వచ్చింది. అంటే గత ఏడాదిలో రూ.16.5 లక్షలకు ఆదాయం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే 2022 డిసెంబరు వరకు రూ.77.5 లక్షల రాబడి వస్తే, 2023లో రూ.99.5 లక్షలు ఆదాయం వచ్చి 2022 సంవత్సరం కంటే రూ.22 లక్షల ఆదాయం పెరిగింది. హైదరాబాద్, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి రోజుకి 280 నుంచి 300 పార్శిల్స్ ఉంటున్నాయని పీటీడీ అధికారులు చెప్పారు. ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు 100 పార్శిల్స్ చేరవేస్తున్నామన్నారు. ప్రైవేటు రవాణా సంస్థల ద్వారా పార్శిళ్లు రావాలంటే రెండు రోజుల సమయం పడుతుంది. పీటీడీ పార్శిల్ సర్వీసు ద్వారా హైదరాబాద్‌లో సాయంత్రం వేస్తే ఉదయానికి పార్శిల్ చేరవేస్తున్నారు. పార్శిల్స్ డోర్ డెలివరీ ఇచ్చే సౌలభ్యం కూడా ఉంది. త్వరలో డోర్ పికప్ సదుపాయం కూడా ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే వివిధ ప్రాంతాల్లో బుకింగ్ ఏజెన్సీలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో బుకింగ్ ఏజెన్సీలు ఇస్తున్నారు. చదువుకున్న యువకులు ముందుకు వచ్చి బుకింగ్ ఏజెన్సీలు నిర్వహిస్తే పార్శిల్స్, కొరియర్ సర్వీసులకు 15 శాతం కమీషన్ అందజేస్తారు. కొయ్యూరు, గొలుగొండ, కేడీపేట, రావికమతం, డి.యర్రవరం, ఏ.శరభవరం, మాకవరపాలెం గ్రామాల్లో పార్శిల్ బుకింగ్ ఏజెన్సీలు ఇచ్చారు. రానున్న రోజుల్లో బుకింగ్ ఏజెన్సీలు విస్తృతం చేయాలని పీటీడీ అధికారులు ప్లాన్ చేస్తున్నారు. కిలో పార్శిల్ వరకు రూ.15లు, కిలో నుంచి 6 కిలోల వరకు రూ.25లు చార్జి చేస్తున్నారు.

డీజీటీ సేవల ద్వారా రూ.4 లక్షల ఆదాయం

జిల్లాలో మూడు డిపో గ్రూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో ఏపీ సీడ్స్ నుంచి విత్తనాలు సరఫరా చేస్తున్నారు. జీడిపప్పు కూడా రవాణా చేస్తున్నారు. కిలోమీటరు రూ.50లు వరకు చార్జి చేస్తున్నారు. ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కంటే తక్కువ చార్జీతో సరకులు వేగంగా డోర్ డెలివరీ చేస్తామని అధికారులు తెలిపారు. మూడు డీజీటీ వాహనాల ద్వారా నెలకు రూ.4 లక్షల ఆదాయం వస్తుందని డిపో మేనేజర్ ధీరజ్ చెప్పారు.

గొడౌన్ లేక ఆరుబయటే పార్శిళ్లు

పార్శిల్ రవాణా కార్యాలయానికి గొడౌన్ సదుపాయం లేక పార్శిళ్లను ఆరుబయట ... మిగతా 8వ పేజీలో

బంగారమ్మపాలెం.. అభివృద్ధికి దూరం

- ఏడాదిగా శుభ్రం చేయని వైనం
- పూర్తికాని ఆర్‌బీకే, డిజిటల్ లైబ్రరీ, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం
- పునాదుల స్థాయిలోనే జగనన్న ఇళ్లు
- జల్‌జీవన్ మిషన్ ఊసే లేదు

శిథిలావస్థలో రక్షిత మంచినీటి పథకం ట్యాంక్





పునాదుల స్థాయిలోనే నిలిచిపోయిన జగనన్న ఇళ్ల నిర్మాణం, (ఇన్‌సెట్‌లో) శిథిలావస్థకు చేరిన రక్షిత మంచినీటి పథకం ట్యాంక్

సబ్బవరం, జనవరి 18: **మండలంలోని బంగారమ్మపాలెం గ్రామం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు కూడా అధికార పార్టీలో అంతర్గత కుమ్ములాటల వల్ల వినియోగించలేని పరిస్థితి నెలకొంది.**

బంగారమ్మపాలెం గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. అది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీని వల్ల ట్యాంక్‌ను శుభ్రం చేసి ఏడాదవుతోంది. దీనిపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతి నిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. ట్యాంక్ సామర్థ్యం చాలక, కొత్త ట్యాంక్ మంజూరుకాక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికీ కొళాయి పథకానికి జల్‌జీవన్ మిషన్ నిధులు గ్రామానికి రూ.20 లక్షలు మంజూరైతే, పనుల నిర్వహణకు అధికార పార్టీ నేతల అంతర్గత కుమ్ములాటల వల్ల ఆ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఆ పథకం అటకెక్కింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రామానికి రూ.14 లక్షలు మంజూరు చేస్తే, ఆ నిధులు కూడా పార్టీ నేతల అంతర్గత కుమ్ములాటల వల్ల ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం లేకపోవడంతో ఆరిపాక రైతు భరోసా కేంద్రం నుంచి రైతులు విత్తనాలు, ఎరువులు తెచ్చుకుంటున్నారు. కాగా డిజిటల్ లైబ్రరీ, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇదిలా వుండగా 60 మంది నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. ఆ స్థలాలను ఊరికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఇవ్వడంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రాలేదు. అధికారులు ఒత్తిడి చేయడంతో అయిష్టంగానే నిర్మాణాలు మొదలు పెట్టారు. అయితే రెండేళ్లు గడుస్తున్నా పునాదుల స్థాయి దాటలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఆగని పోరు.. నిరసనల జోరు

- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె గురువారానికి 38వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టగా, పరవాడలోని శిబిరం వద్ద అంగన్‌వాడీలు మోకాళ్లపై నిల్చొని దండం పెడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు.



పరవాడలో మోకాళ్లపై నిల్చొని దండం పెడుతూ నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

క్రైం... crime news

ఏలేరు కాలువలో గుర్తుతెలియని మృతదేహం

అనకాపల్లి టౌన్, జనవరి 18: సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట వద్ద ఏలేరు కాలువలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని పట్టణ ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఆరెంజ్ కలర్ చొక్కా, బ్లాక్ కలర్ డ్రాయర్ శరీరంపై ఉన్నాయని ఆయన తెలిపారు. ఎవరికైనా మృతుడు వివరాలు తెలిసినచో టౌన్ సీఐ సెల్ నంబరు 9490737758, టౌన్ పోలీస్‌స్టేషన్ కంట్రోల్ రూమ్ నంబరు 9154879719లకు సమాచారం అందజేయాలని ఎస్ఐ సింహాచలం కోరారు.

బస్సు ఢీకొని కృష్ణా జిల్లా వాసి మృతి


క్రాంతికిరణ్ (ఫైల్ ఫొటో)

ఎస్.రాయవరం, జనవరి 18: మండలంలోని గోకులపాడు వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. గోకులపాడు వద్ద ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా విశాఖ వైపు నుంచి విజయవాడ వెళుతున్న బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మణం చెందాడు. మృతి చెందిన వ్యక్తి దగ్గర ఉన్న బ్యాగులో గల ఆధార్ ఆధారంగా మృతుడు కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన వి.క్రాంతికిరణ్‌గా (57)గా గుర్తించారు. అతడి బ్యాగ్‌లో బట్టలు, ఆధార్‌కార్డు తప్ప ఇంకేమిలేవని, క్రాంతికిరణ్ ఎవరన్నది తెలియాల్సి ఉందని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి మార్చ్యురీలో భద్రపరిచినట్టు చెప్పారు.

అన్నవరం తీర్థంలో ఘర్షణ

- ఇరువర్గాల బాహాబాహీ.. ▸ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన
- పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో డీఎస్పీ చర్చలు



చోడవరం పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ఇరువర్గాలకు చెందిన యువకులు

చోడవరం, జనవరి 18: పట్టణ శివారు అన్నవరంలో బుధవారం రాత్రి తీర్థమహోత్సవం సందర్భంగా ఇరువర్గాలకు చెందిన యువకుల మధ్య తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. ఇరుపక్షాల వారు బాహాబాహీకి దిగడ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ వివాదానికి సంబంధించి ఇరువర్గాలు గురువారం మధ్యాహ్నం మరోసారి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు చర్చలు జరిపి వివాదాన్ని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అన్నవరం గ్రామంలో బుధవారం రాత్రి తీర్థం సందర్భంగా ఇరువర్గాలకు చెందిన కొందరు యువకుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరినొకరు తోసుకోవడంతో స్థానికులు విడదీసి పంపించివేశారు. ఇది జరిగిన మరికొంత సేపటికి మరోసారి రెండువర్గాల యువకులు ఘర్షణకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ వివాదంలో ఒక వర్గానికి చెందిన యువకుడికి గాయాలు కావడంతో మరోసారి రెండువర్గాల యువకులు కొట్లాటకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో రాత్రి సద్దుమణిగింది. ఇదిలావుంటే, గురువారం మధ్యాహ్నం మరోసారి రెండు వర్గాల యువకులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. తమపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ ఒకవర్గం ఆందోళను దిగారు. అలాగే, తమపై దాడిచేసి, కులం పేరుతో అవమానించిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ రెండోవర్గం కూడా నినాదాలు చేయడంతో స్టేషన్ వద్ద పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అప్పలనాయుడు తదితరులు ఇరుపక్షాల వారిని స్టేషన్‌లోనికి పిలిచి చర్చలు జరుపుతున్నారు. అనవసరంగా వివాదాలకు దిగకుండా వ్యవహరించాలంటూ నచ్చచెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం రాత్రి వరకూ పోలీస్ స్టేషన్‌లో ఇరుపక్షాల పెద్దలతో పోలీసులు చర్చలు జరుపుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


గాయపడిన బొబ్బిలి దేముళ్లు

దేవరాపల్లి, జనవరి 18: మండల కేంద్రం దేవరాపల్లిలో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. దేవరాపల్లికి చెందిన వెత్సా రమేష్ ఇక్కడి పెట్రోల్ బంకు నుంచి మధ్యాహ్నం ఇంటికి వస్తుండగా, గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో అతని కాలుకు తీవ్ర గాయం కావడంతో విశాఖపట్నంలోని ఆస్పత్రికి తరలించారు. అలాగే, రైవాడ నుంచి పెట్రోల్ బంకుకు వెళుతున్న బొబ్బిలి దేముళ్లను దొగ్గ దేమున్నాయుడు ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని 108లో కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దేముళ్లు భార్య దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలావుంటే, వాలాబు వాటర్ ఫాల్స్‌కు యువకులు అతి వేగంగా వాహనాలతో వెళుతుండడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పోలీసులు కట్టడికి చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


ఉమామహేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

కశింకోట, జనవరి 18: మండల కేంద్రంలోని గోవింద కాలనీకి చెందిన వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని సీఐ కె.వినోద్‌బాబు తెలిపారు. అనకాపల్లిలోని ఒక మాల్‌లో పనిచేస్తున్న సూరిశెట్టి మహేశ్వరరావు ఈనెల 17న ఉదయం 9 గంటలకు బయలుదేరివెళ్లి తిరిగి రాకపోవడంతో అతని అన్నయ్య ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కోడి పందాలు, పేకాట ఆడుతున్న 9 మందిపై కేసులు

సబ్బవరం, జనవరి 18: మండలంలోని గుల్లేపల్లి, మొగలిపురం, అమృతపురం గ్రామాల్లో పేకాట, కోడి పందాలు ఆడుతున్న 9 మందిపై కేసులు నమోదు చేసి, రూ.3,550 నగదు, 4 కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ గురువారం తెలిపారు. అమృతపురంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2,800 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. గుల్లేపల్లి, మొగలిపురంల్లో కోడి పందాలు ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.750 నగదు స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు పునఃప్రారంభం

సింహాచలం, జనవరి 18: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత సేవలను గురువారం నుంచి పునఃప్రారంభించారు. గత నెలలో అధ్యయనోత్సవాలు పురస్కరించుకుని అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఉత్సవాలు పూర్తి కావడంతో సేవలను పునరుద్ధరించారు. ఈ మేరకు వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో ప్రధానార్చకుడు ఐవీ రమణాచార్యులు సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక స్వర్ణ సంపెంగలతో పూజ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అమ్మో.. పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్

- రాంగ్ రూట్‌లపై దృష్టి సారించని పోలీసులు
- ఈ జంక్షన్‌లో కానరాని విద్యుత్ లైట్లు


పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనాలు


పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద కానరాని విద్యుత్ లైట్లు

ఎలమంచిలి, జనవరి 18: పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ పేరు చెబితే చాలు ప్రజల హడలిపోతారు. ఈ జంక్షన్ యాక్సిడెంట్ పాయింట్‌గా పేరొందింది. మండలంలోని పోతిరెడ్డిపాలెం జంక్షన్‌లో ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలు ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ జంక్షన్‌లో పగలు మాటెలా ఉన్నా.. రాత్రి అయితే కటిక చీకటి అలుముకుంటుంది. చీకటిలో పాదచారులు గ్రామంలోకి వెళ్లేందుకు హైవే రోడ్డును క్రాస్ చేస్తున్న సమయంలో అమిత వేగంతో వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈనెల 8వ తేదీ రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో కారు ప్రమాదానికి గురై భార్యాభర్తలు మృతి చెందిన సంగతి తెలిసిందే. అంతకుముందు మరో ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఇక్కడ ప్రమాదాల బారిన పడి స్వల్ప గాయాలతో బయటపడిన పలు సంఘటనలు చాలా ఉన్నాయి. దీనికి తోడు హైవేపై పలు జంక్షన్ల వద్ద ఎక్కువగా వాహనదారులు రాంగ్ రూట్‌లలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సమయంలో ఎదురుగా వచ్చే వాహనదారులు గమనించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాంగ్ రూట్‌లలో ద్విచక్ర వాహనదారులే కాకుండా పెద్ద వాహనాలు కూడా వస్తున్నాయి. మర్రిబంద, రేగుపాలెం, పోతిరెడ్డిపాలెం, పురుషోత్తపురం, పులపర్తి జంక్షన్‌ల వద్ద రాంగ్‌రూట్‌లలో ప్రయాణిస్తున్న వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయనే విమర్శలున్నాయి. హైవేపై రౌండ్‌ది క్లాక్ విధులు నిర్వహించే పెట్రోలింగ్ గానీ, స్థానిక పోలీసులు కానీ రాంగ్‌రూట్‌లలో ప్రయాణించే వారిపై చర్యలు తీసుకుంటే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. హైవే జంక్షన్‌లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని పోతిరెడ్డిపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.

తెలుగు ప్రజల ఆరాధ్యుడు ఎన్టీఆర్

- వర్ధంతి సభలో కీర్తించిన మాజీ మంత్రి అయ్యన్న
- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనుడు జగన్


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అయ్యన్న

నర్సీపట్నం అర్బన్, జనవరి 18 : తెలుగు ప్రజల ఆరాధ్యుడు నందమూరి తారక రామారావు అని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని వేములపూడి ఎంపీటీసీ బోళెం రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పరగూడెంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం అయ్యన్న మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. నాడు మద్యం షాపులు ఎత్తివేస్తామని చెప్పిన జగన్... నేడు అదే షాపులపై వచ్చే ఆదాయంతోనే రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. పంచాయతీల్లో ఒక్క రూపాయి కూడా లేకుండా చేసి గ్రామాల అభివృద్ధికి అడ్డంకులు సృష్టించారన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ పాలన చూసిన ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరు

- పొలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అనిత, చిరంజీవరావు, విజయ్, తదితరులు

కోటవురట్ల, జనవరి 18: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత జోస్యం చెప్పారు. గురువారం మండలంలోని బోడపాలెం శివారు కొత్తూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీరావు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అనిత మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో టీడీపీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో వైసీపీ ఎమ్మెల్యేలను మార్చడం కాదు ఏకంగా సీఎం జగనే మారిస్తే సరిపోతుందన్నారు. జగన్ అభివృద్ధి చేసి ఉంటే ఎమ్మెల్యేలను ఎందుకు మారుస్తున్నారని ఆమె ప్రశ్నించారు. పందూరు, జల్లూరు వంతెనలు టీడీపీ హయాంలో మంజూరు చేస్తే.. వాటిని పూర్తిచేయకుండా గాలికి వదిలేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోతాయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేకపోవడం శోచనీయమన్నారు. సంక్షేమం, అభివృద్ధి, మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మరల చంద్రబాబునాయుడుని సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ టీడీపీ నాయకులపై సీఎం జగన్ ఎన్ని కేసులు,పెట్టినా.. అరెస్టు చేసినా.. భయపడేది లేదన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలుగుదేశం పార్టీ గెలుపును ఆపలేరన్నారు. కార్యక్రమంలో వేచలపు జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, కార్యదర్శి పెట్ల లింగంనాయుడు, నక్కపల్లి పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు


రైల్వే గేటు సమీపంలోని హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఎలమంచిలి, జనవరి 18: పట్టణంలోని కొక్కిరాపల్లి రైల్వేగేటు సమీపంలోని హోటల్‌లో గురువారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీజ తన సిబ్బందితో కలిసి తినుబండాలను పరిశీలించారు. ఈ హోటల్‌లో ఆహార పదార్థాలు నాణ్యత లేకుండా విక్రయిస్తున్నారంటూ స్థానికుల నుంచి ఫిర్యాదు రావడంతో ఈ తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. వినియోగదారులకు విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. హోటల్‌లో విక్రయించే పలు శాంపిళ్లను సేకరించి తనిఖీలకు పంపుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో 3 హోటళ్లలో ఆహార పదార్థాల తనిఖీలు నిర్వహించామని, వీటి శాంపిళ్లను సేకరించామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీజ తెలిపారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వైసీపీ నుంచి నలుగురు కార్పొరేటర్లు సస్పెన్షన్?

- తమకు సమాచారం లేదంటున్న సదరు కార్పొరేటర్లు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు కార్పొరేటర్లను సస్పెండ్ చేసినట్టు ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌పై బహిరంగంగా విమర్శలు చేయడంతో పాటు పార్టీకి రాజీనామా చేసిన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌తో సన్నిహితంగా ఉంటున్న కొంతమంది కార్పొరేటర్లను తీరు మార్చుకోవాలని పార్టీ నేతలు హెచ్చరించారు. అయినప్పటికీ వాసుపల్లికి టికెట్టు ఇస్తే ఓడిస్తామంటూ పునరుద్ఘాటించడంతో 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్, 35వవ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 37 వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ విషయం సంబంధిత కార్పొరేటర్ల వద్ద ప్రస్తావించగా తమకు ఇంతవరకూఎటువంటి సమాచారం అందలేదని చెప్పడం విశేషం. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన ఉత్తరాంధ్ర నేతల సమన్వయ సమావేశానికి నలుగురు కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వలేదు.

నేటి నుంచి మునిసిపాలిటీలో కుల గణన సర్వే

ఎలమంచిలి, జనవరి 18: మునిసిపాలిటీలో శుక్రవారం నుంచి కుల గణన సర్వే నిర్వహించనున్నట్టు కమిషనర్ కేపీ.కొండలరావు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సర్వే జరుగుతుందరు. కుల గణన సర్వే నిర్వహించే సమయంలో గ్రామంలో లేని కుటుంబాలకు ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఆయా సచివాలయాల్లో సర్వే చేస్తారన్నారు.

రామన్నపాలెంలో ఉచిత పశువైద్య శిబిరం

కోటవురట్ల, జనవరి 18: మండలంలోని రామన్నపాలెంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏడీ సింహాద్రప్పుడు, సర్పంచ్ చినఅప్పన్న ప్రారంభించారు. శిబిరంలో ఎదకు రాని 66పశువులకు, 17 లేగదూడలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టరు హరిప్రియ, ప్రతాప్, బాబురావు పడాల్, శిరీష పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై అవగాహన

పాయకరావుపేట, జనవరి 18: మండలంలో గ్రామాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించడంపై ప్రజాప్రతినిధులకు గురువారం అవగాహన కల్పించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎంపీడీఓ సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ వర్మ, వైవీ.సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించడం, పంచాయతీల నిధులు, వీటిని ఖర్చు చేసే విధానం తదితర అంశాలపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచా యతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కేఎస్.గాంధీ పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవల్సిన చర్యలపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సెక్రటరీలకు శిక్షణ ఇచ్చారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు, ఈవోఆర్‌డీ బి.సత్యనారాయణ తదితరులు పలు సూచనలు చేశారు. పంచాయతీల అభివృద్ధికి ఎటువంటి ప్రణాళికలు రూపొందించాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నరేశ్, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో...

రాంబిల్లి: పక్కా ప్రణాళికలతో పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ జి.శిరీష అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీల కార్యదర్శులకు గ్రామ పంచాయతీ ప్రణాళికపై నిర్వహించిన శిక్షణలో ఆవె మాట్లాడారు. పంచాయతీల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు బీవీఎస్ రాజు, కె.శివప్రసాద్ ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్ కొండలరావు పాల్గొన్నారు.

13,994 మంది గృహ లబ్ధిదారులకు వడ్డీ రాయితీ

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


గృహ లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్,జనవరి 18: జిల్లాలోని 13,994 మంది గృహ లబ్ధిదారులకు రూ.1.34 కోట్ల వడ్డీ రాయితీని ఇవ్వడంతో పాటు మరో 43,904 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35వేలు చొప్పున రూ.కోటి 54 లక్షల 67 వేలు అదనపు రుణ సదుపాయం కల్పించామని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం సీఎం జగన్మోహన్‌రెడ్డి గృహ లబ్ధిదారులకు వర్చువల్ విధానంలో వడ్డీ రాయితీని జమ చేయగా, శంకరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు నమూనా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ పీడీ రమామణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తదితరులు పాల్గొన్నారు.

కోడి కత్తితో దాడి కేసులో ఏడుగురు అరెస్టు

- డీఎస్పీ సుబ్బరాజు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు, పక్కన సీఐ, ఎస్ఐ

బుచ్చెయ్యపేట, జనవరి 18: కోడి కత్తితో దాడి చేసిన ఘటనలో ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్టు అనకాపల్లి డీఎస్పీ సబ్బరాజు తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం కోడి పందాల వద్ద వడ్డాది రెల్లి కాలనీకి చెందిన బొర్రా తేజ, స్థానిక ఈబీసీ కాలనీకి చెందిన అదట్రావు శ్రీరామ్‌ల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుందన్నారు. దీంతో ఒకరిపై మరొకరు ఛాలెంజ్‌లు చేసుకున్నట్టు చెప్పారు. సాయంత్రం స్థానిక వెంకటేశ్వర థియేటర్ వద్ద ఉన్న బొర్రా తేజ, భూపతి రాజులపై శ్రీరామ్, గండెం సాయికుమార్, కొరసాల గణేష్, మాకాల త్రినాథరావు, గండెంప్రసాద్, సుంకర కిరణ్ రాజ్, వెలుగుల సురేంద్రలు తేజపై కత్తి, రాయి, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. భూపతి రాజు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఏడుగురు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. వీరిని చోడవరం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. సంఘటన జరిగిన ప్రాంతంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు, బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలి

- పీటీడీ డిప్యూటీ సీపీఎం సుధాబిందు


సమావేశంలో మాట్లాడుతున్న సుధాబిందు

అనకాపల్లి టౌన్, జనవరి 18: డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడపాలని పీటీడీ డిప్యూటీ సీపీఎం సుధాబిందు అన్నారు. స్థానిక పీటీడీ డిపోలో గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్రైవర్లు డిపో నుంచి బస్సు బయటకు తీసేటప్పుడు కండిషన్‌ను పరిశీలించుకోవాలన్నారు. ఏమైనా అర్జీలు రాసి ఉంటే మెకానిక్‌లు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి సహకరిస్తానన్నారు. ఇప్పటివరకు జోన్ పరిధిలో 200 మంది కార్మికులు పదవీవిరమణ చేయగా.. 150 మందికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం జరిగిందని, మిగిలిన వారికి అతి త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిపో మేనేజర్ ఎన్.సుజాత, సీఐ రవిచంద్ర, ఏఎంఎఫ్ అశ్విని, ఏఎస్ఐ త్రిమూర్తులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ నేషనల్ ఉషూ పోటీలకు క్రీడాకారిణులు పయనం


పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

నర్సీపట్నం అర్బన్, జనవరి 18 : కొయంబత్తూరులో శుక్రవారం నుంచి జరగనున్న ఖేల్ ఇండియా సౌత్ జోన్ నేషనల్ ఉషూ చాంపియన్ పోటీలకు నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఏడుగురు క్రీడాకారిణులు పయనమయ్యారు. రాజ రాజేశ్వరి, కె.శార్వాణి, కె.శరణ్య, నివేదిత, బిందుశ్రీ, దివ్య హారిక, అంకితలు సబ్ జూనియర్స్, జూనియర్ విభాగాల్లో తలపడనున్నారని నింజాస్ అకాడమీ బోర్డు డైరెక్టర్ బోళెం శివ తెలిపారు.

ఆక్రమణలను పట్టించుకోని అధికారులపై చర్యలు తప్పవు

- మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

సబ్బవరం, జనవరి 18 : మండలంలో పలు గ్రామాల్లో విచ్చలవిడిగా ప్రభుత్వ భూముల కబ్జాలకు గురవుతున్నా తహసీల్దార్ సహా సిబ్బంది పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే తప్ప రక్షణ లేకుండా పోయిందన్నారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అందువలనే కబ్జాదారులు రెచ్చిపోయి గెడ్డలు, వాగులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బదిలీపై వెళ్లినా నిర్లక్ష్యం వహించిన అధికారులపై కొత్త ప్రభుత్వంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రిపబ్లిక్ డే క్యాంప్‌నకు ప్రశాంతి విద్యార్థి


అనిల్ కుమార్

అచ్యుతాపురం, జనవరి 18: ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు విజయవాడలో జరిగే రిపబ్లిక్ డే క్యాంప్‌కు ప్రశాంతి పాలిటెక్నిక్ ఎన్‌సీసీ కేడెట్ జి.అనిల్ కుమార్ ఎంపికయినట్టు ఎన్‌సీసీ అధికారి మణికంఠ తెలిపారు. ఈ కవాతుకు విశాఖపట్నం గ్రూపు నుంచి పాల్గొంటున్న 12 మందిలో ఈయన ఒకడని తెలిపారు. అనిల్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ అభినందనలు తెలిపారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

» మాజీ మంత్రి దాడి వీరభద్రరావు.. » వాడవాడలా ఎన్టీఆర్‌కు ఘన నివాళులు.. » పేదలకు దుస్తుల పంపిణీ


అనకాపల్లి ఎన్టీఆర్ జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దాడి వీరభద్రరావు, పీలా గోవింద, పరుచూరి భాస్కరరావు

అనకాపల్లి టౌన్, జనవరి 18 : రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీ రామారావు అని, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు అమలు చేస్తున్నాయని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. గురువారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని జిల్లాలో వాడవాడలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా చేపట్టారు. అనకాపల్లి ఎన్టీఆర్ జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడి మాట్లాడుతూ భవిష్యత్తులో నారా లోకేశ్ పార్టీకి దిక్సూచిలా నిలుస్తారన్నారు. చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నేతృత్వంలో మరో వంద రోజుల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి అవినీతిరహిత పాలనను అందిస్తారన్నారు. రింగురోడ్డులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, టీడీపీ యువ నాయకుడు దాడి రత్నాకర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీపీ నారాయణరావు, మాదంశెట్టి నీలబాబు, కోట్ని బాలాజీ, మళ్ల సురేంద్ర, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లక్ష్మీనారాయణనగర్‌లోని డీవీఆర్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి రత్నాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులో జరిగిన కార్యక్రమంలో కార్మికులు, కొలగార్లు, మహిళలకు దాడి రత్నాకర్, పీలా గోవింద, బుద్ద నాగజగదీశ్వరరావు దుప్పట్లు, ఒక కిలో పంచదార ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ పూలమాల వేశారు. అనంతరం వైద్యాలయంలో పీలా గోవింద, నీలబాబు, సురేంద్రలు రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

తుమ్మపాలలో.. అనకాపల్లి మండలం తుమ్మపాల, బవులవాడ తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ, జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని బాలాజీ, కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబి, వియ్యపు సింహాచలం, కోట్ని ఈశ్వరరావు, తోటాడ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్‌లో.. మండలంలోని అక్కిరెడ్డిపాలెం శివారు తారకరామకాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు అక్కిరెడ్డి రమణబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాదపు రాంబాబు, నూకరాజు పాల్గొన్నారు.

కశింకోట/కొత్తూరుల్లో.. అనకాపల్లి నియోజకవర్గంలో వెంకుపాలెం, కశింకోట, తీడ గ్రామాల్లో స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కశింకోటలో ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, యువ నాయకుడు దాడి రత్నాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకుపాలెం, తీడ గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు, రిక్షా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కాండ్రేగుల సతీష్ కుమార్, కాయల మురళీ, కోట్ని బాలాజీ, ఉగ్గిన రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ కేకేవీపీ.నారాయణరావు, జనసేన పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


అనకాపల్లి మార్కెట్ యార్డులో దుప్పట్లు పంపిణీ చేస్తున్న బుద్ద నాగజగదీష్, పీలా గోవింద, దాడి రత్నాకర్

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని నామవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యవరం, పాల్తేరు, కుమారపురం, మంగవరం, అరట్లకోట, మాసాహెబ్‌పేట తదితర గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, పల్లా బాబూరావు, గొర్ల బాబ్జీ, ఈగల సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండల కేంద్రంలో టీడీపీ సీనియర్ నేత కందుల వెంటేశ్వరరావు, గుడివాడలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు, ఉప్పరాపల్లిలో సీనియర్ నేత తుంపాల నాగేశ్వరరావు ఎన్టీఆర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


కశింకోటలో బసవ తారకం విగ్రహం వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కట్, కె. వీరరాజశేఖర్, కర్రి రామనాగేశ్వరరావు పాల్గొన్నారు. వెంకటాపురంలో తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి కడియం అనురాధ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు జరిగాయి.

పరవాడలో.. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం పరవాడ, వెన్నెలపాలెంల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీలు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, నాయకులు అట్టా సన్యాసిఅప్పారావు, వియ్యపు చిన్న పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జి, కురందాసు నూకరాజు, ఎంపీపీ వైబోయిన రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అద్దూరి లోవరాజు, గింజాల లక్ష్మణరావు, కేవీ సత్యనారాయణ, గోసల శ్రీకాంత్, జి. తాతారావు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. స్థానిక వై జంక్షన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంది కాశీవిశ్వనాథం, చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరీ, మలిపెద్ది వెంకటరమణ, సూరా సుబ్రహ్మణ్యం, జూరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి మాజీ వైస్ ఎంపీపీ గొర్రెల రాజబాబు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మజ్జూరి నారాయణరావు, దేవవరపు ఆనంద్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. మండలంలోని పూడిమడకలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 180 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నేతలు రాజాన రమేష్‌కుమార్, లాలం భవానీ, మేరుగు బాపునాయుడు, పొన్నమళ్ల కొండబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంజేపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి జనసేన నేత సుందరపు విజయకుమార్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పతివాడ చిన్నంనాయుడు, కరెడ్ల సూర్యప్రకాష్, పి.కాసుబాబు, బి. రాంబాబు పాల్గొన్నారు.


పరవాడలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి బండారు తదితరులు

రాంబిల్లిలో.. మండలంలోని హరిపురం, మర్రిపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, డి.రంగనాయకులు, దిన్‌బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.ఎస్ రాజు, దూళి అప్పారావు, రమణ,కిల్లాడ శ్రీను పాల్గొన్నారు. జడ్‌చింతువాలో ఎన్టీఆర్ చిత్రపటానికి తెలుగు యువత నాయకుడు ఎరిపల్లి అజయ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎరిపల్లి చిట్టిబాబు, చెల్లూరి ఆనంద్ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. ఎలమంచిలి టీడీపీ కార్యాయలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 260 మందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజాన సూర్య నాగేశ్వరరావు, గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, మజ్జి రామకృష్ణ, బొద్దపు శ్రీను పాల్గొన్నారు. మండలంలోని కృష్ణాపురంలో టీడీపీ నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజాన నారాయణమ్మ, కొలుకులూరి విజయ్‌బాబు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు(శేషు), ఇత్తంశెట్టి రాజు, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కె.నాగేశ్వరావు పాల్గొన్నారు. మునిసిపాలిటీలోని పెదపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి బొద్దపు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దంట్ల వెంకటస్వామి, నమ్మి రమణ, అనుసూరి కృష్ణ పాల్గొన్నారు.

సబ్బవరంలో.. స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నాయకులు ఎం.మహాలక్ష్మీనాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బండారు అప్పలనాయుడు, గండి రవికుమార్, సర్పంచ్ దెడ్డం ప్రసాద్ పాల్గొన్నారు. వెదుళ్లనరవలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, గణపతినగర్‌లో బీసీ సెల్ జిల్లా కార్యదర్శి రేసుపూడి రమణ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పాయకరావుపేటలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


అచ్యుతాపురం: పూడిమడక రక్తదానం శిబిరాన్ని ప్రారంభించిన ప్రగడ నాగేశ్వరరావు

మునగపాకలో.. మండలంలోని మునగపాక, తిమ్మరాజుపేట, నాగులాపల్లి గ్రామాలలో నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, పెంటకోట విజయ్, దాడి ముసిలినాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, కొయిలాడ వెం


ఎలమంచిలిలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు


రాంబిల్లి: హరిపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, రంగనాయకులు, దిన్‌బాబు


నక్కపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


ఎస్ రాయవరంలో ఎన్‌టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

అచ్యుతాపురం, జనవరి 18: ఆల్ ఆంధ్ర మ్యాజిక్ ఫ్రెండ్స్ గ్రూప్ ద్వారా తోటి డ్రైవర్ కుటుంబానికి రూ.60 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అచ్యుతాపురానికి చెందిన డ్రైవర్ బాబ్జీ అనారోగ్యంతో ఇటీవల మరణించారు. తోటి డ్రైవర్లంతా రూ.60వేలు బాబ్జీ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డి.సత్యనారాయణ, త్రిమూర్తులు, నేమాల కొండబాబు, డి.అశోక్ పాల్గొన్నారు.

38వ రోజు అంగన్‌వాడీల ఆందోళన

పరవాడ, జనవరి 18 : తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారం నాటికి 38వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి. శ్రీలక్ష్మి నిరసన శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మోకాళ్లపై నిల్చొని దండం పెడుతూ ప్రభుత్వం తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు సీహెచ్.దేవి, ఎం.రమణి, ఎస్. పార్వతి, రామలక్ష్మి, అరుణ, శ్రీదేవి పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్‌లో.. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీల సమ్మె గురువారం 38వ రోజుకి చేరుకుంది. నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నాగశేషు మాట్లాడుతూ బెదిరింపులతో అంగన్‌వాడీల సమ్మెను అణచివేయలేరన్నారు.


ఎలమంచిలి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద షోకాజ్ నోటీసులతో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

రాంబిల్లిలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీల చేస్తున్న నిరసన గురువారానికి 38వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా నోటీసులకు అంగన్‌వాడీలు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ వేధింపులకు గురిచేయంతగదన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీల నాయకులు మంగ, సుజాత, నూకరత్నం పాల్గొన్నారు.

సబ్బవరంలో.. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 38 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించనట్టయితే సమ్మెను తీవ్రతరం చేస్తామని ప్రాజెక్టు అధ్యక్షురాలు వీవీ రమణమ్మ హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఎం. వరలక్ష్మి, జగదీశ్వరి, దేవి పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని అంగన్‌వాడీల హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నాగశేషు కోరారు. గురువారం అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన షోకాజ్ నోటీసులకు 50 మందితో కలిసి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయ అధికారికి షోకాజ్ నోటీసులకు సమాధానాలు అందజేశారు.

టికెట్ టెన్షన్

... 5వ పేజీ తరువాయి

నియమించగా, రెండో జాబితాలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కాకుండా అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మలసాల భరత్‌ను, పాయకరావుపేటకు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు స్థానంలో కంబాల జోగులును సమన్వయకర్తలుగా నియమించారు. మూడో జాబితాలో విశాఖ లోక్‌సభ నియోజకవర్గం ఇన్‌చార్జిగా బొత్స ఝాన్సీలక్ష్మిని నియమించింది. ఎనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమిస్తూ గురువారం రాత్రి నాలుగో జాబితా విడుదల చేసింది. ఇందులో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించిన నియోజకవర్గాల ప్రస్తావన లేకపోవడంతో అనకాపల్లి ఎంపీతోపాటు రెండు జిల్లాల ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తల్లో ఉత్కంఠ వీడలేదు. విశాఖ జిల్లాలో భీమిలి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉన్నారు. ఆయన అభ్యర్థిత్వంపై పార్టీ క్యాడర్‌తో పాటు కార్పొరేటర్లు, మత్స్యకార సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. దీంతో వాసుపల్లి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించడంపై అధిష్ఠానం దృష్టి సారించిందనే ప్రచారం జరుగుతోంది. అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తారనే ప్రచారం చాలాకాలంగా జరుగుతోంది. పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి, ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారికి అవకాశం ఇస్తారనే ప్రచారం ఉంది. మరోవైపు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరు కూడా వినిపిస్తోంది. ఇక పెందుర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు టికెట్ లేదని కొన్నాళ్ల కిందట అధిష్ఠానం చెప్పినట్టు ప్రచారం జరిగింది. మంత్రి అమర్‌నాథ్‌కు పెందుర్తి నుంచి పోటీకి అవకాశం ఇవ్వడం ఖాయమని ప్రచారం జరిగినప్పటికీ, ఎందుకనో తిరిగి అదీప్‌రాజ్‌నే సన్నద్ధం కావాలని అధిష్ఠానం సూచించినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. చోడవరం సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి కూడా అవకాశం ఇవ్వకూడదని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్టు ప్రచారం జరిగింది. మంత్రి అమర్‌నాథ్ అక్కడి నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నారని, సీఎం జగన్ కూడా అంగీకరించారని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కరణం ధర్మశ్రీని తాడేపల్లి పిలిచి వివరించగా, మంత్రి అమర్‌నాథ్‌కు తప్ప ఎవరికి అవకాశం ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని, లేనిపక్షంలో తనకు అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టంచేసినట్టు సమాచారం. దీంతో అధిష్ఠానం పునరాలోచనలో పడినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. చోడవరం నుంచి ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై ఆసక్తినెలకొంది. నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు కూడా వచ్చే ఎన్నికల్లో పోటీకి అధిష్ఠానం నుంచి ఇంతవరకూ ఎలాంటి గ్రీన్‌సిగ్నల్ లభించలేదని సమాచారం. నాలుగో జాబితాలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించిన సమన్వయకర్తలు, ఇన్‌చార్జుల ప్రకటన ఉంటుందని అంతా ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే రెండు జిల్లాల ప్రస్తావన లేకపోవడంతో సిట్టింగ్‌లు, ఆశావహుల్లో ఉత్కంఠ మరికొంతకాలం కొనసాగనున్నది.

షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో బెల్టు షాపు

... 5వ పేజీ తరువాయి

వేలాది రూపాయలు వెనకేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనకాపల్లికి కూతవేటు దూరంలో ఉన్న తుమ్మపాల వీవీ రమణ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఒక వ్యక్తి ఏకంగా ఫ్యాక్టరీ స్థలంలోనే బెల్టు దుకాణాన్ని ఏర్పాటు చేశారు. మద్యం బెల్టు షాపు ఏర్పాటుతో పాటు షుగర్ ఫ్యాక్టరీ సిబ్బందికి చెందిన శిథిల నివాస గృహాల్లో ఓపెన్ బార్ కూడా నిర్వహిస్తున్నారు. మూత పడిన షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో పండుగ మూడు రోజులు బెల్టు దుకాణంతోపాటు ఓపెన్ బార్ నిర్వహించేందుకు స్థానిక వైసీపీ నేత అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫ్యాక్టరీ సిబ్బందికి చెందిన శిథిలావస్థలో ఉన్న నివాస గృహాల్లో మందుబాబులు గత నాలుగు రోజులుగా తాగి చిందులేస్తున్నా, షుగర్ ఫ్యాక్టరీ అధికారులు గానీ, రక్షణ సిబ్బంది కానీ కనీసం ప్రాంగణంలో మద్యం విక్రయాలు, తాగడానికి అడ్డు చెప్పకపోవడం గమనార్హం. దీన్ని బట్టి షుగర్ ఫ్యాక్టర్ అధికారుల ప్రమేయం ఉన్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం అమ్మకాలు, ఓపెన్ బార్ నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

పార్శిల్ ఆదాయం భేష్

... 5వ పేజీ తరువాయి

ఉంచాల్సి వస్తున్నది. కార్యాలయం లోపల ఖాళీ లేకపోవడంతో విలువైన సరకులు ఆరుబయట వదిలేస్తున్నారు. దీని వల్ల వర్షం పడినప్పుడు పార్శిళ్లు తడిసిపోవడం, సిబ్బంది వాటిని హడావిడిగా వేరే చోటకు తరలించడం వంటి ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయానికి అనుబంధంగా గొడౌన్ నిర్మించాలని వినియోగదారులు కోరుతున్నారు.

నేడు ఎలమంచిలి కనకమహాలక్ష్మి జాతర



ఎలమంచిలి, జనవరి 18: పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం శుక్రవారం రాత్రి నిర్వహించేందుకు ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన లైటింగ్, భారీ విద్యుత్ సెట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతర ఏర్పాట్లను కమిటీ ప్రతినిధులు కొరారు సాంబ, కొరారు కొండబాబు, సత్యనారాయణ, రాము పర్యవేక్షించారు.

అయోధ్య శ్రీరాముని అక్షింతలు పంపిణీ

అనకాపల్లి టౌన్, జనవరి 18 : అయోధ్య శ్రీరాముని అక్షింతలను శ్రీవారి సేవా సమితి ఆర్గనైజర్ దాడి రాజేశ్వరి గురువారం నూకాంబిక ఆలయంలో చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ధర్మకర్తలకు అందజేశారు. అనంతరం స్వామివారి అక్షింతలు, కరపత్రాలను భక్తులకు, సిబ్బందికి అందించారు. ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, సిబ్బంది శ్రీరామునికి పూజలు నిర్వహించారు.

అనకాపల్లిలో మారథాన్


నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడిన దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 18 : సామాజిక సమతా సంకల్ప మహోత్సవాల్లో భాగంగా స్థానిక జాతీయ రహదారిలోని పూడిమడక జంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకు గురువారం మారథాన్ నిర్వహించారు. నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్పతనం గురించి వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారిణి మంజులావాణి, డీఆర్‌డీఏ ఏపీడీ శచీదేవి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్. వెంకటరమణ, సాంఘిక సంక్షేమశాఖ ఏడీ అజయ్‌బాబు, డీఎస్‌డీవో ఎల్‌వీ రమణ, డీవీఎంసీ సభ్యుడు బొడ్డేడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వేల్పులవీధి గౌరమ్మ సారె ఊరేగింపు


అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

అనకాపల్లి టౌన్, జనవరి 18 : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరులకు గురువారం సాయంత్రం సారెను నైవేద్యంగా పెట్టారు. కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై సారె ఊరేగింపును ప్రారంభించారు. మహిళలు తమ ఇళ్లల్లో తయారుచేసిన పిండివంటలు, మిఠాయిలను వేల్పులవీధి రామాలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పురవీధుల గుండా సారెను ఊరేగించి మెయిన్‌రోడ్డులోని వేల్పులవీధి వద్ద అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు, ఉపాధ్యక్షుడు ఎస్.నరసింగరావు, కార్యదర్శి మద్దాల నూకరాజు, సహాయ కార్యదర్శి పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీలు ప్రారంభం

మునగపాక, జనవరి 18: మండలంలోని పాటిపల్లిలో గురువారం మండల స్థాయి కబడ్డీ పోటీలను ఎంపీపీ మళ్ల జయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడారి కృష్ణవేణి, ఈవోఆర్‌డీ వెంకటలక్ష్మి, వైసీపీ నాయకులు ఆడారి త్రిమూర్తులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో తీర్థాలు

రాంబిల్లి, జనవరి 18: మండలంలోని మూడు గ్రామాల్లో గురువారం తీర్థాల సందడి నెలకొంది. కొత్తూరు మామిడివాడలో పైడితల్లమ్మ అమ్మవారు, వెంకటాపురం, కొప్పుగొండుపాలెం గ్రామాల్లో సీతారాముల తీర్థాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. కొత్తూరు మామిడివాడలో పైడితల్లిని, వెంకటాపురంలో సీతారాముల వారిని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డి.రంగనాయకులు దర్శించి పూజలు చేశారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ

అనకాపల్లి టౌన్, జనవరి 18 : స్థానిక గవరపాలెంలోని వినాయక గౌరీ సేవా సమితి, పీలా గౌరీపరమేశ్వరుల సంక్రాంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం పేదలకు చీరలు, దుప్పట్లను ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు భీమరశెట్టి శ్రీనివాసరావు, బుద్ద బల్లమ్మనాయుడు, భీమరశెట్టి లక్ష్మీనారాయణ, బుద్ద శ్రీనివాసరావు, దాడి రామకృష్ణ, బుద్ద శివ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి మైక్‌సెట్ వితరణ

పరవాడ, జనవరి 18 : నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం పంచాయతీల పరిధిలోని హనుమాన్‌నగర్ వద్ద గల అభయాంజనేయస్వామి ఆలయానికి పెదగంట్యాడ మండలం దిబ్బపాలెంకి చెందిన వి. సింహాద్రి భారతి దంపతులు మైక్‌సెట్‌ను వితరణ చేశారు. గురువారం రూ.26వేల విలువైన మైక్‌సెట్‌ను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు లాలం అప్పలనాయుడు, సమ్మంగి సోమేశ్వరరావు, అప్పలరాజు, లక్ష్మీప్రసాద్, కిలపర్తి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు నాయుడుపాలెం జట్టు ఎంపిక

పరవాడ,జనవరి 18: ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా లంకెలపాలెం హైస్కూల్‌లో గురువారం పెదముషిడివాడ, నాయుడుపాలెం జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో నాయుడుపాలెం జట్టు విజయం సాధించి, నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నాజీరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ నాగేశ్వరరావు, లోవరాజు, ఎన్‌వీ. రమణ, సత్యవతి, అమ్మాజీ, దేవి, లక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

అనకాపల్లి టౌన్, జనవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ యాజమాన్య హక్కు చట్టం 27/2023ను నిరసిస్తూ న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షలు గురువారం కొనసాగాయి. న్యాయవాదులు సాయిలక్ష్మణ్, సూరా శ్రీనివాస్, కుమార్, సుంకర శ్రీనివాస్, కనిశెట్టి సురేష్, శరత్, కాత్యాయిని దీక్షలో పాల్గొన్నారు.

సీఐ శంకరరావవుకు సత్కారం

అనకాపల్లి టౌన్, జనవరి 18 : పట్టణ సీఐ జి. శంకరరావును స్థానిక వేల్పులవీధి గౌరమ్మ జాతర కమిటీ గురువారం రాత్రి సత్కరించింది. కమిటీ చైర్మన్ వాకాడ బాబు ఆధ్వర్యంలో సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా జాతర నిర్వహణపై సీఐ కమిటీ సభ్యులతో చర్చించారు.

వేల్పులవీధి గౌరమ్మ ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన దాడి

అనకాపల్లి టౌన్, జనవరి 18 : ఈనెల 20వ తేదీన జరిగే వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల జాతర పోస్టర్‌ను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. లక్ష్మీనారాయణనగర్‌లోని డీవీఆర్ క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు, మద్దాల నూకరాజు, ఎస్. నరసింగరావు, వేల్పుల గణేష్, నల్లల రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- గొప్పలు చెప్పడమే తప్ప వైసీపీ నాయకులు చేసిందేమీ లేదు
- నర్సీపట్నంలో కిలో మీటరు రోడ్డు వేసేందుకు నానా పాట్లు
- పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్


బయ్యవరం సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

మాకవరపాలెం, జనవరి 18 : గ్రామాల అభివృద్ధి టీడీపీ హయంలోనే జరిగాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. మండలంలోని బయ్యవరంలో టీడీపీ శ్రేణులతో గురువారం రాత్రి ఏర్పాటైన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. బయ్యవరంలో సిమెంటు రోడ్ల నుంచి అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల వరకూ తమ ప్రభుత్వ హయాంలోనే నిర్మించామన్నారు. ప్రస్తుత వైసీపీ నాయకులు అభివృద్ధి చేయకపోగా గ్లోబుల్ ప్రచారం మాత్రం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం, ఇక్కడ అయ్యన్నపాత్రుడు మంత్రి కావడం తథ్యమన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు ఎక్కడైనా జరిగాయా.. అని ప్రశ్నించారు. డ్వాక్రా మహిళలకు ఎంతో చేస్తున్నామని వైసీపీ నాయకులు గొప్పలు చెపుతున్నా అది కార్యరూపం దాల్చడం లేదన్నారు. సంక్షేమం అంటూ అనేక షరతులు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నర్సీపట్నంలో కిలో మీటరు రోడ్డు వేసేందుకు నానా పాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలంతా రానున్న ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజయ్ పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, ఎంపీటీసీ నూకరాజు, సీనియర్ నాయకులు అల్లు రామునాయుడు, రమణ, చినబాబు, బుచ్చి రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ టెన్షన్

... 5వ పేజీ తరువాయి

నియమించగా, రెండో జాబితాలో సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కాకుండా అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మలసాల భరత్‌ను, పాయకరావుపేటకు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు స్థానంలో కంబాల జోగులును సమన్వయకర్తలుగా నియమించారు. మూడో జాబితాలో విశాఖ లోక్‌సభ నియోజకవర్గం ఇన్‌చార్జిగా బొత్స ఝాన్సీలక్ష్మిని నియమించింది. ఎనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమిస్తూ గురువారం రాత్రి నాలుగో జాబితా విడుదల చేసింది. ఇందులో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించిన నియోజకవర్గాల ప్రస్తావన లేకపోవడంతో అనకాపల్లి ఎంపీతోపాటు రెండు జిల్లాల ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తల్లో ఉత్కంఠ వీడలేదు. విశాఖ జిల్లాలో భీమిలి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉన్నారు. ఆయన అభ్యర్థిత్వంపై పార్టీ క్యాడర్‌తోపాటు కార్పొరేటర్లు, మత్స్యకార సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. దీంతో వాసుపల్లి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించడంపై అధిష్ఠానం దృష్టిసారించిందనే ప్రచారం జరుగుతోంది. అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తారనే ప్రచారం చాలాకాలంగా జరుగుతోంది. పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి, ఎలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారికి అవకాశం ఇస్తారనే ప్రచారం ఉంది. మరోవైపు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేరు కూడా వినిపిస్తోంది. ఇక పెందుర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు టికెట్ లేదని కొన్నాళ్ల కిందట అధిష్ఠానం చెప్పినట్టు ప్రచారం జరిగింది. మంత్రి అమర్‌నాథ్‌కు పెందుర్తి నుంచి పోటీకి అవకాశం ఇవ్వడం ఖాయమని ప్రచారం జరిగినప్పటికీ, ఎందుకనో తిరిగి అదీప్‌రాజ్‌నే సన్నద్ధం కావాలని అధిష్ఠానం సూచించినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. చోడవరం సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి కూడా అవకాశం ఇవ్వకూడదని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్టు ప్రచారం జరిగింది. మంత్రి అమర్‌నాథ్ అక్కడి నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నారని, సీఎం జగన్ కూడా అంగీకరించారని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కరణం ధర్మశ్రీని తాడేపల్లి పిలిచి వివరించగా, మంత్రి అమర్‌నాథ్‌కు తప్ప ఎవరికి అవకాశం ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని, లేనిపక్షంలో తనకు అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టంచేసినట్టు సమాచారం. దీంతో అధిష్ఠానం పునరాలోచనలో పడినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. చోడవరం నుంచి ఎవరికి అవకాశం దక్కుతుందనే దానిపై ఆసక్తినెలకొంది. నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు కూడా వచ్చే ఎన్నికల్లో పోటీకి అధిష్ఠానం నుంచి ఇంతవరకూ ఎలాంటి గ్రీన్‌సిగ్నల్ లభించలేదని సమాచారం. నాలుగో జాబితాలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించిన సమన్వయకర్తలు, ఇన్‌చార్జుల ప్రకటన ఉంటుందని అంతా ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే రెండు జిల్లాల ప్రస్తావన లేకపోవడంతో సిట్టింగ్‌లు, ఆశావహుల్లో ఉత్కంఠ మరికొంతకాలం కొనసాగనున్నది.


రావికమతం : కొత్తకోటలో ఎన్టీఆర్ విగ్రహానికి నీలవేణి నివాళి


గొలుగొండ : ఏఎల్‌పురంలో పేదలకు వేణుగోపాల్ దుస్తుల పంపిణీ


మాడుగులలో రోగులకు రొట్టెల పంపిణీలో పీవీజీ కుమార్, పైలా ప్రసాద్

అందరివాడు ఎన్టీఆర్

- వర్ధంతి సభల్లో కీర్తించిన వక్తలు
- వాడవాడలా టీడీపీ శ్రేణులు, అభిమానుల నివాళి


చోడవరంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న బత్తుల తాతయ్యబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు తదితరులు

చోడవరం, జనవరి 18 : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని గురువారం వాడవాడలా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా చోడవరంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఎన్టీఆర్ విగ్రహం వద్ద అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ అందరి వాడుగా పేర్కొన్నారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ లీగల్‌సెల్ నాయకులు గూనూరు లక్ష్మీనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, గొర్లె కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : చంద్రబాబుతోనే ఎన్టీఆర్ ఆశయ సాధన సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. బంగారుమెట్ట, రాజాంలలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతిలో మాట్లాడారు. రాజాంలో పేదలకు బట్టలు, పండ్లు పంచిపెట్టారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, నాయకులు దొంకిన అప్పలనాయుడు, నాగులాపల్లి సత్యనారాయణ, మరిసా నరేష్, సతీష్, సాయం శేషు, దొండా శ్రీను, వేణు చౌదరి, దొండా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : మండలంలో ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ శ్రేణులు నిర్వహించారు. కొత్తకోటలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, టి.అర్జాపురంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, రావికమతంలో ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీ గంజి సూర్యనారాయణ, గుమ్మాళ్లపాడులో సీనియర్ నాయకులు కాళింగ తాతలు, జెడ్.కొత్తపట్నంలో మాజీ సర్పంచ్ తాతాజీల ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు బత్తుల తాతయ్యబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, ఉగ్గిన శ్రీను, కోట సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జేపీ అగ్రహారంలో మాజీ సర్పంచ్ రొంగలి రమణ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు బత్తుల తాతయ్యబాబు, గునూరు మల్లునాయుడు తదితరులు హాజరై ఎన్టీఆర్‌ను నివాళులర్పించారు. కుసర్లపూడిలో గండి తాతాజీ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్రలతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలో గ్రామ గ్రామాన ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. గొలుగొండలో పార్టీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు చిటికెల సాంబమూర్తి, సుర్ల బాబ్జీ, కొల్లి రాంబాబు, బెల్లపు కొండలరావు, పారేపల్లి నాగేశ్వరరావు, రాయపురెడ్డి రాంబాబు, గెడ్డం ఆనంద్, కొమిర గ్రామంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు కర్రి నాయుడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

కృష్ణాదేవిపేట : తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ అన్నారు. ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, సీహెచ్.నాగాపురం, కొంగశింగి, చోద్యం తదితర గ్రామాల్లో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో ఆయనతో పాటు పలువురు నాయకులు పాల్గొని ఎన్టీఆర్‌కు అంజలి ఘటించారు. అనంతరం ఏఎల్‌పురంలో నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్‌లు కుందూరు అప్పారావు, కొలగాని రామారావు, నాయకులు బొడ్డు జమీలు, గొంప వాసు, లగుడు రమేష్, పెట్ల నారాయణమూర్తి, బొలిశెట్టి పాపారావు, బొప్పన ప్రసాద్, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : రాష్ట్రంలో సంక్షేమ పాలనకు ఎన్టీఆర్ ఆద్యుడని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నాతవరంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కొండబాబు, మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, నాయకులు అప్పిరెడ్డి మాణిక్యం, శెట్టి లోవ, సీతారామ్మూర్తి, జీరెడ్డి రాజుబాబు, బంగారు సూరిబాబు, సూరిబాబు, మరిడియ్య, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలో పలుచోట్ల ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. రామన్నపాలెం, తూటిపాల, మాకవరపాలెం, లచ్చన్నపాలెం, బూరుగుపాలెం తామరం, బయ్యవరం తదితర గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ సేవలను కీర్తించారు. నాయకులు అల్లు రామునాయుడు, జోగిపాత్రుడు, రాము, లక్ష్మినాయుడు, నూకరాజు, దేముడు, కేతిరెడ్డి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల/మాడుగుల రూరల్ : పేదల సంక్షేమానికి ఎన్నెన్నో పథకాలను ప్రవేశపెట్టి, వారికి బాసటగా నిలిచిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మాడుగుల బస్టాండ్‌లో గల ఆయన విగ్రహానికి పార్టీ సీనియర్ నాయకుడు పైలా ప్రసాదరావుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, స్వీట్లు పంచిపెట్టారు. మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రంజిత్, లెక్కల కాశిబాబు, రమేష్, సూర్యనారాయణరాజు. డిల్లీ నానాజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కేజేపురంలో ఎన్టీఆర్ వర్ధంతిని జరిపారు. ఆయన చిత్రపటానికి ఎంపీటీసీ భీశెట్టి శ్రీనివాస్, జోగినాయుడు, రాము, నాగమణి తదితరులు నివాళులర్పించారు.

దేవరాపల్లి : ఎన్టీఆర్ ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఆయన వర్ధంతి సందర్భంగా దేవరాపల్లి, రైవాడ, కాశీపురం తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు వారాది అప్పారావు, వాండ్రాసి రాము, వారాది కృష్ణ, నాగరాజు, శ్రీను, గవిరెడ్డి, సింహ, ఆదిరెడ్డి గోవింద, బండారు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. చీడికాడలో మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు, ఎంపీటీసీలు బీశ్ల కోటేశ్వరరావు, పైల ముత్యాలనాయుడు, పెంటకోట అమ్మతల్లినాయుడు, నాయకులు పడాల కన్నంనాయుడు, కొల్లి సూరినాయుడు, జోకల దేముడుబాబు, జె.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడుతో పాటు పలు గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కె.కోటపాడులో జరిగిన కార్యక్రమానికి నాయకులు పీవీజీ కుమార్, పైలా ప్రసాదరావు హాజరై అంజలి ఘటించారు. నాయకులు రొంగలి మహేష్, నరసింహమూర్తి, బ్రహ్మాజీ, భూపతి అప్పలరాజు, రాము నాయుడు, కశిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా జాతరలు


నాతవరంలో కుంతీదేవి విగ్రహం ఊరేగింపు


ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

నాతవరం, జనవరి 18 : మండల కేంద్రం నాతవరంలో కుంతీదేవి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. సుమారు మూడు నెలల క్రితం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు జరిపారు. చివరి రోజున మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ పెద్ద ఎత్తున ఊరేగింపు చేపట్టారు. ఈ వేడుకలో చిన్నారుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇందులో భాగంగా మహిళలు వివిధ రకాల పిండి వంటలతో కుంతీదేవికి సారెను పైడిరాజు ఇంటి నుంచి తీసుకు వెళ్లి నైవేద్యంగా సమర్పించారు. అక్కడ పూజల అనంతరం దాలమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు గోమి సత్యనారాయణ, చెక్కా జోగిరాజు, మర్తి రాంబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కృష్ణాదేవిపేట : కొంగసింగిలో రాములవారి తీర్థాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఏఎల్‌పురం, పాత కృష్ణాదేవిపేట, లింగంపేట, చోద్యం, పల్లావూరు, గొలుగొండ, జోగంపేట, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో కోలాహల వాతావరణం నెలకొంది. సాయంత్రం ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ యలమంచిలి నూకరత్నం, వరహాల బాబు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కొంగసింగిలో తీర్థానికి హాజరైన జనం

'దళితులపై దాడులు దారుణం'


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేవీపీఎస్ నాయకులు

బుచ్చెయ్యపేట, జనవరి 18 : కోడి కత్తితో చేసిన దాడిలో గాయపడిన జొర్రా తేజ కుటుంబానికి రక్షణ కల్పించాలని కులవివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరెల్లి చిరంజీవి పోలీసు అధికారులను కోరారు. గురువారం ఆయన వడ్డాదిలో తేజ కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పినపాత్రుని సాంబశివరావు, బూసి కోటి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు టీడీపీ పరిశీలకులుగా చిన్నంనాయుడు



చీడికాడ, జనవరి 18 : అరకు నియోజకవర్గం ముంచంగిపుట్టు మండల టీడీపీ పరిశీలకులుగా ఆ పార్టీ చీడికాడ మండల అధ్యక్షుడిగా పని చేస్తున్న పోతల చిన్నం నాయుడును నియమించారు. ఈ మేరకు జిల్లా కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం టీడీపీ ఆధ్వర్యంలో రా..కదలిరా.. కార్యక్రమం అరకులో జరుగుతుందన్నారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు హాజరు కానున్న నేపథ్యంలో ముంచంగిపుట్టు మండలం నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేయనున్నట్టు ఆయన వివరించారు.

ఎ.కొత్తపల్లిలో కబడ్డీ పోటీలు ప్రారంభం

దేవరాపల్లి, జనవరి 18 : మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో ముత్యమాంబ తీర్థం సందర్భంగా గురువారం కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. జడ్పీటీసీ కర్రి సత్యం పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొత్తం పన్నెండు జట్లు పోటీలో తలపడుతున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులు బూరే బాబూరావు, చింతల బుల్లి లక్ష్మి, వెంకటరమణ, కర్రి సూరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్ ఆదాయం భేష్

... 5వ పేజీ తరువాయి

ఉంచాల్సి వస్తున్నది. కార్యాలయం లోపల ఖాళీ లేకపోవడంతో విలువైన సరకులు ఆరుబయట వదిలేస్తున్నారు. దీని వల్ల వర్షం పడినప్పుడు పార్శిళ్లు తడిసిపోవడం, సిబ్బంది వాటిని హడావిడిగా వేరే చోటకు తరలించడం వంటి ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయానికి అనుబంధంగా గొడౌన్ నిర్మించాలని వినియోగదారులు కోరుతున్నారు.

వేతనాల పెంపుపై స్పష్టత వచ్చే వరకు పోరాటం

- అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టీకరణ
- కొనసాగుతున్న దీక్షలు


నర్సీపట్నంలో గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీల నినాదాలు



దేవరాపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా

నర్సీపట్నం అర్బన్, జనవరి 18 : డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన రోజు రోజుకు ఉధృతమవుతోంది. ఈ సందర్భంగా నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో దీక్షకు దిగిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గురువారం మాట్లాడుతూ కనీస వేతనాలు, గ్రాట్యుటీ, పీఎఫ్, ఈఎస్ఐ తదితరాలు పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు. వీరికి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు త్రిమూర్తులురెడ్డి, సీఐటీయూ నాయకుడు రాజు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం నాయకురాళ్లు డి.మహాలక్ష్మి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : వేతనాల పెంపుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు దీక్షను విరమించేది లేదని అంగన్‌వాడీలు ప్రకటించారు. గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఇక్కడ డిమాండ్ల సాధనకు సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ తమ సమస్యలపై దీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సంజాయిషీ పత్రాలను సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు మంగతాయారు. భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 38వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దేవరాపల్లిలో గురువారం వారంతా భారీ ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం ముందు డిమాండ్లపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకురాళ్లు జి.వరలక్ష్మి, అమ్మాజీ, గౌరీ, ఉమా, సన్యాసమ్మ, చెల్లమ్మ మాట్లాడుతూ ఎస్మా ప్రయోగించి రాజ్యాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అపహాస్యం చేసిందన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేయడం మాని డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.


గొలుగొండలో షోకాజ్ నోటీసులకు సంజాయిషీ పత్రాలు సమర్పిస్తున్న దృశ్యం

షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో బెల్టు షాపు

... 5వ పేజీ తరువాయి

వేలాది రూపాయలు వెనకేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనకాపల్లికి కూతవేటు దూరంలో ఉన్న తుమ్మపాల వీవీ రమణ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఒక వ్యక్తి ఏకంగా ఫ్యాక్టరీ స్థలంలోనే బెల్టు దుకాణాన్ని ఏర్పాటు చేశారు. మద్యం బెల్టు షాపు ఏర్పాటుతో పాటు షుగర్ ఫ్యాక్టరీ సిబ్బందికి చెందిన శిథిల నివాస గృహాల్లో ఓపెన్ బార్ కూడా నిర్వహిస్తున్నారు. మూత పడిన షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో పండుగ మూడు రోజులు బెల్టు దుకాణంతోపాటు ఓపెన్ బార్ నిర్వహించేందుకు స్థానిక వైసీపీ నేత అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫ్యాక్టరీ సిబ్బందికి చెందిన శిథిలావస్థలో ఉన్న నివాస గృహాల్లో మందుబాబులు గత నాలుగు రోజులుగా తాగి చిందులేస్తున్నా, షుగర్ ఫ్యాక్టరీ అధికారులు గానీ, రక్షణ సిబ్బంది కానీ కనీసం ప్రాంగణంలో మద్యం విక్రయాలు, తాగడానికి అడ్డు చెప్పకపోవడం గమనార్హం. దీన్ని బట్టి షుగర్ ఫ్యాక్టర్ అధికారుల ప్రమేయం ఉన్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం అమ్మకాలు, ఓపెన్ బార్ నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

'సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం'

మాకవరపాలెం/గొలుగొండ/రోలుగుంట, జనవరి 18 : రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల ప్రణాళికలపై సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు పలు మండలాల్లో గురువారం శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. మాకవరపాలెంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఏవో చిరంజీవి, ఎంఈవో మూర్తి, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటైన ఈ శిక్షణ శిబిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులను ఉద్దేశించి ఎంపీపీ గజ్జలపు మణికుమారి మాట్లాడుతూ ముందుగా గ్రామాల్లో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు సాధించవచ్చునన్నారు. వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సీనియర్ కార్యదర్శి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు సరైన ప్రణాళిక అవసరమని రోలుగుంట ఈవోపీఆర్డీ నూకరాజు అన్నారు. గురువారం రోలుగుంట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండో రోజు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. గ్రామాల్లో మెరుగైన జీవనోపాధి కల్పించడం, రక్షిత తాగునీరు, పచ్చదనం-పరిశుభ్రతతో పాటు మరో ఆరు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఆయన వెల్లడించారు.